క్లుప్తంగా

రేషనలైజేషన్ ప్రక్రియ నిలిపివేయాలని వినతి



తాళ్లపూడి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

తాళ్లపూడి: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ మండల కమిటీ సభ్యులు బుధవారం వినతిపత్రాన్ని మండల తహసీల్దారు శ్రీనివాసరావుకు, ఎంపీడీవో వెంకటరమణలకు అందజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయాల ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు, సేవలు అందిస్తున్న వారికి రేషనలైజేషన్ పేరిట చేస్తున్న బదిలీలు బాధాకరమని అన్నారు. తక్షణమే ఈ బదిలీలు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు గెడ్డం గణేష్, మండల సచివాలయ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ఇర్లపాటి వినీల్, ప్రధాన కార్యదర్శి సాధనాల శ్రీను, ఉపాధ్యక్షులు కాకర్ల శ్యాం ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ భారతి, వెల్ఫేర్ అసిస్టెంట్ తేజ తదితరులు తెలిపారు.

ఆహార పొట్లాల పంపిణీ

నిడదవోలు : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గొపిరెడ్డి శ్రీనివాస్, గుంటిపల్లి శివ కుమార్, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

నల్లజర్ల: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శ ఎం.శేఖర్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. మండలంలో ఉన్న బుక్ డిపో సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులతో పాటు నిరుద్యోగ యువత పోటీపరీక్షలకు వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయ పాలకురాలు ఏవీ రమణ, బుక్ డిపో నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

ఉండ్రాజవరం : మండల కేంద్రమైన ఉండ్రాజవరం పాత ఎస్సీ ఏరియాలో రామాలయం వీధిలో సీసీ రోడ్డు, డ్రేనేజీ పనులు చేపట్టారు. ఈ పనులను బుధవారం సర్పంచ్ మెండే వెంకట్రావు ఎంపీటీసీ గాడి కృష్ణఫర్ పరిశీలించారు. 30 ఏళ్లగా ఈ ప్రాంతంలో సరైనా రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బంది పడుతుండడంతో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేయించారు. దీంతో పనులు జరుగుతున్నాయి.

వృక్ష జాతుల సంరక్షణ అందరి బాధ్యత



కొవ్వూరులో సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న రవీంద్రకుమార్

కొవ్వూరు: అంతరించి పోతున్న వృక్ష జాతులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఉద్యాన వన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రకుమార్ పేర్కొన్నారు. పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో బుధవారం లైఫ్ సైన్స్‌సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వర్క్ షాపు నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మక పెంచేందుకు ఈ వర్క్ షాపులు, సెమినార్‌లు ఉపకరిస్తాయన్నారు. మొక్కల కణజాల వర్ధనం, పోషక యనక తయారీ, పోషకాయనక తయారీని సూక్ష్మ జీవర హితం చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మొక్కలను పెంచవ చ్చున న్నారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ మోడల్స్ ప్రదర్శనను ఆయన తిలకించారు. డి.మాధురిదేవి, కె.సురేష్‌బాబు, టి.శశికళ, బి.రత్నదీపికా, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు, పీజీ డైరెక్టర్ సీహెచ్ చలపతిరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.నూరి బాబు, వైస్ ప్రిన్సిపల్ వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

చాగల్లు: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.నాగరాజు తెలిపారు. చాగల్లు శివారులో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి, వారి నుంచి రూ.6680 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ

- వంద పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్
- రూ.19 కోట్ల నిధులు మంజూరు
- అందుబాటులోకి రానున్న మెరుగైన వసతులు
- పట్టణం, ఐదు మండలాలకు ఉపయోగకరం



నిడదవోలు 100 పడకల ఏరియా ఆసుపత్రి నమూనా చిత్రం



పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం

నిడదవోలు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి మహర్దశ పట్టింది. 30 పడకల ఉన్న ఈ ఆసుపత్రిని వంద పడకలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. గతేడాది కాపు నేస్తం నిధుల విడుదలకు నిడదవోలు పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అభ్యర్థన మేరకు నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు బహిరంగ సభలో ప్రకటించారు. ప్రభుత్వం రూ.19 కోట్లు మంజూరు చేయడంతో ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనికి ఎమ్మెల్యే నేడు శంకుస్థాపన చేయనున్నారు.

నిర్మించనున్న గదులివే..

నిడదవోలు వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణంలో భాగంగా అత్యవసర ఆపరేషన్ థియేటర్, మూడు ఎమర్జెన్సీ వార్డులు, ఒక డెలివరీ రూం, హెచ్ఐవీ విభాగం, టీబీ విభాగం, మహిళల వార్డు, పురుషుల వార్డు, అత్యాధునిక సెంట్రల్ ల్యాబరేటరీ, మహిళలు, పురుషులకు కలిపి 14 ఓపీ గదులు, ఎస్ఎన్‌సీసీ చిల్డ్రన్స్ కేర్ యూనిట్, ఐసోలేషన్ వార్డు, ఎక్స్‌రే యూనిట్‌తో కలిపి మొత్తం 51,400 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా నిర్మించనున్నారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయితే నిడదవోలు ప్రాంతాల ప్రజలకు నయా పైసా ఖర్చు లేకుండా అన్ని రకాల వైద్య సేవలు అందనున్నాయి.

రోజుకు 350 ఓపీ..

ప్రస్తుతం ఇక్కడకు రోజు 350 మందికి పైగా ఓపీ సేవలు పొందుతున్నారు. నెలకు 50 వరకూ ప్రసవాలు కూడా ఉంటున్నాయి. అయితే ఇక్కడ అత్యవసర వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందకపోవడంతో ప్రమాదాలు గురైన క్షతగాత్రులను రాజమహేంద్రవరం, తణుకు ఏరియా ఆసుపత్రులకు వైద్యులు రిఫర్ చేస్తున్నారు. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో లేక రోగులు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పాలవుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు రోగుల అవసరాలను, అత్యవసరమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రిని 100 పగకలుగా అప్‌గ్రేడ్ చేయడానికి ఎంతో కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగా ఇప్పుడు పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందనున్నాయి. ఏరియా ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే 20 మందికి పైగా డాక్టర్లు, వంద మందికి పైగా వైద్య సిబ్బందితోపాటు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, చాగల్లు, కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పేదలకు ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదు పోలీస్ స్టేషనులకు సంబంధించిన వివిధ కేసులు ఇక్కడకు తీసుకువస్తున్నారు.

వంద పడకల ఆసుపత్రి పూర్తయితే...

ఎముకలు (ఆర్థోపెడిక్)వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి. రోగులకు కంటి ఆపరేషన్లు, చెవి, ముక్కు, గొంతు వైద్యసేవలు, ఊపిరితిత్తులు, పెద్ద ఐసీయూ యూనిట్, ఎమర్జెన్సీ వైద్య సేవలు, అత్యధునిక ఎక్స్‌రే సేవలు, ఎంఆర్ఐ సిటీ స్కాన్ సేవలు ఉచితంగా పేదలకు అందుబాటులోకి వస్తాయి.

వైద్యుల నియామకంపై ప్రత్యేక దృష్టి

గత టీడీపీ హయాంలో ఇద్దరు వైద్యులు, ఇద్దరు నర్సులు మాత్రమే ఉండేవారు. ఆసుపత్రి అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఎంతో పట్టుదలతో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి, అత్యధునిక వైద్య పరికరాలను మంజూరు చేయించారు. ప్రస్తుతం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎనిమిది మంది వైద్యులు, 10 మంది స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఫార్మటిస్టులు, నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరుగురు జీడీఏ సిబ్బంది, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఎఫ్ఎంఓ, దోబి, ఆరోగ్య డీఈ, ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఎఫ్ఎన్ఓ, ఆరుగురు పారిశుధ్య కార్మికులు, నలుగురు సెక్యూరిటీ సిబ్బంది, మొత్తం 42 మంది ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్య విభాగం, మత్తు వైద్యులు, ప్రసూతి సేవలు, కంటి, దంత వైద్య సేవలు, టీబీ, హెచ్ఐవీ, ఐసీటీసీ, ఆర్ఎన్‌టీపీ విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో 50 పడకులకు సరిపడా సెంట్రల్ ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయం కూడా ఉంది. ఆపరేషన్ థియేటర్, అత్యాధునిక లేబర్‌రూం, ఎంబీఎస్‌యూ చిన్నపిల్లల కేర్ యూనిట్ (ఎంబీఎస్‌యూ), ఆధునిక టెక్నాలజీతో రక్త పరీక్షల కేంద్రం, నీరుడు, ఉమ్మి పరీక్షలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా బ్లడ్ స్టోరేజ్ యూనిట్, డిజిటల్ ఎక్స్‌రే మిషన్, 51 కేవీ సామర్థ్యం ఉన్న జనరేటర్, సుమారు 60 మంది పురుడు పోసుకునే గది అందుబాటులో ఉన్నాయి.

వైద్య రంగానికి పెద్దపీట



ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ప్రజారోగ్యానికి అవసరమైన మేరకు ఆసుపత్రులను, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేస్తోంది. సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందడంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. ఆక్సిజన్, అత్యధునిక వైద్య పరికాలు, అన్ని రక్త పరీక్షలు, వైద్యలను అందుబాటులోకి తీసువచ్చాం. పేదలకు సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు, అత్యవసర వైద్య సేవలకు వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయడానికి రూ.19 కోట్లు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాం

– జి.శ్రీనివాసనాయుడు, నిడదవోలు ఎమ్మెల్యే

కార్పొరేటుకు దీటుగా..



30 పడకలు ఆసుపత్రి రోగులకు సరిపోక ఇబ్బందులు పడ్డాం. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు కృషితో వంద పడకలకు అప్‌గ్రేడ్ అయ్యింది. ఇప్పుడు ఆ ఇబ్బందులన్నీ తొలగిపోతున్నాయి. ఎమర్జెన్సీ అత్యవసర విభాగాల్లో అత్యవసర కేసులు వస్తే రాజమండ్రి, తణుకు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసేవాళ్లం. గతంలో ఇద్దరు వైద్యులు మాత్రమే ఉండేవారు. కానీ ఇప్పుడు 8 మంది వైద్యులు వివిధ విభాగాల్లో వైద్య సేవలందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– ఏవీఆర్ఎస్ తాతారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్, నిడదవోలు

హామీలన్నీ అమలు చేశాం.. ఆదరించండి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కొవ్వూరు పట్టణంలో ముమ్మరంగా ఇంటింటా ప్రచారం



కొవ్వూరు ఆరో వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ

కొవ్వూరు: ఎన్నికల సమయం ఇచ్చిన ప్రతి ఒక్క వాగ్దానం అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు కోరారు. ప్రజా ఆశీర్వాదం పేరుతో చేపట్టిన ఇంటింటా ప్రచారం కార్యక్రమం బుధవారం పట్టణంలో 8, 6, 7 వార్డుల్లో నిర్వహిచారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకుని రావడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌లను ఆశీర్వాదించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వ రరావు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, పట్టణ పార్టీ గౌరవ అధ్యక్షుడు నగ్గళ్ల పాటి శ్రీనివాస్, అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు పోసిన శ్రీకృష్ణదేవరాయులు, పట్టణ యూత్ ప్రెసిడెంట్ సిద్ధన వాసు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మరపట్ల శ్రీనివాస్, పట్టణ ఎస్సీసెల్ నాయకులు చదలవాడ మధు, వరిగేటి సుధాకర్, రుద్రం వీర బాబు, గాడి శరత్ రాజ్ కుమార్, గోశాల శ్రీనివాస్, గుర్రే శరత్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, గంధ్రోతు శివరామకృష్ణ, చోప్పా అప్పల నాయుడు, పిక్కి శ్రీనివాస్, మాసా ఆనంద్, యాళ్ల నరసింహారావు, గంగాధర నాగేశ్వరరావు, పతివాడ రామారావు, చిట్బూరి అన్నవరం, పాకా మోహన్‌రావు, కో–ఆప్షన్ సభ్యులు ఏలూరి వెంకట్, ఎండీ ఆలీ, కౌన్సిలర్‌లు అంకోలు వెంకట లిల్లీ పద్మ లీల, తోట లక్ష్మిప్రసన్న, చీరా అరుణ, మద్దిపట్ల సాయిగీత, వరిగేటి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

- డిప్యూటీ వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టరు సంధ్య
- పోతవరం పీహెచ్‌సీలో వివిధ శాఖల సిబ్బందిపై విచారణ



పోతవరం పీహెచ్‌సీలో విచారిస్తున్న డాక్టరు సంధ్య

నల్లజర్ల: పోతవరం పీహెచ్‌సీలో అధికారులు, ఉద్యోగులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని డిప్యూటీ వైద్య.ఆరోగ్యశాఖాధికారిణి డాక్టరు సంధ్య హెచ్చరించారు. పోతవరం పీహెచ్‌సీ పనితీరుపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలపై డాక్టరు సంధ్య స్పందించారు. బుధవారం 11 గంటల సమయంలో ఆమె స్వయంగా పోతవరం పీహెచ్‌సీకి వచ్చి డ్యూటీలో ఉన్న డాక్టరు వెంకట్రావు, ఫార్మాసిస్ట్ వెంకటేశ్వరరావు, స్టాఫ్‌నర్స్‌లు భవానీ, అమరావతి, ఎంపీహెచ్ఓ సత్యం, పీహెచ్ఎన్ ఇందిర, హెచ్‌వీ మీరామేరిలను విచారణ చేశారు. సిబ్బంది మధ్య సమన్వయ లోపం కనపడుతుందని, ఎవరి డ్యూటీలు వారు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. గతంలో ఒకసారి వచ్చి ఇదే విషయాలపై హెచ్చరించామని, మళ్లీ అదే పరిస్థితి ఉందని, ఇకపై ఏ తప్పు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీలు పాపానాగేశ్వరావు, చిడిపి చింతయ్య, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మీ వెంకటరత్నం, జాలధిరవిలు డాక్టరు సంధ్యను కలసి పీహెచ్‌సీ పనితీరుపై మాట్లాడారు. 24 గంటలు పని చేయాల్సిన ఆసుపత్రి సాయంత్రం 4 గంటలకే మూసేస్తున్నారని ఆదివారం అసలు తలుపులే తీయడం లేదన్న విషయాన్ని సర్పంచ్ లక్ష్మణరావు తెలిపారు. దీనిపై సంధ్య మాట్లాడుతూ ఇకపై 24 గంటలు, ఆదివారం కూడా పని చేయాలని ఆదేశించారు. వ్యాక్సిన్ కూడా స్థానికంగా నిల్వ ఉంచాలన్నారు. మంగళవారం డ్యూటిలో ఎందుకు లేరో లిఖిత పూర్వక సంజాయిషీ లెటరు ఇవ్వాలని డాక్టరు సంధ్య కోరారు.

సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



శిబిరంలో రోగులకు మందుల కిట్లను అందిస్తున్న ఆదినారాయణ

నిడదవోలు: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా పేదలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని వీక్లీ మార్కెట్ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 క్యాంపు నిర్వహించారు. శిబిరంలో అందుతున్న వైద్య పరిక్షలను చైర్మన్ ఆదినారాయణ పరిశీలించారు. వైదయులు 353 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందుల కిట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్లు ఉసురుమర్తి జాన్‌బాబు, అరుగొళ్ళ వెంకటేశ్వర్లు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్ మృతిపై సంతాపం

కొవ్వూరు: మున్సిపాలిటీలో పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న జరుగుల వాసుబాబు అకాల మృతిపై మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయు, జేఏసీ కమిటీ సంతాపం వ్యక్తం చేశాయి. బుధవారం వాసుబాబు మృతదేహానికి మున్సిపల్ కార్యాలయం వద్ద సంఘ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, ఏజేసీ కమిటీ అధ్యక్షుడు రాజాన అప్పారావు, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ బి.శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపాన్ని తెలిపారు.

బంధపురం పొలాల్లో పెద్దపులి



బంధపురంలోని పొగాకు తోటల్లో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు



గొల్లగూడెం బంధపురం రోడ్డులోని పొగాకు తోటలో అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు

దేవరపల్లి: పెద్దపులి దేవరపల్లి, గోపాలపురం మండలాల రైతులను వణికిస్తోంది. మూడు రోజులుగా దేవరపల్లి మండలంలోని బంధపురం, గొల్లగూడెం గ్రామాలోనూ గోపాలపురం మండలం పెద్దాపురం గ్రామాల్లోని పొగాకు తోటల్లో సంచరిస్తోంది. పులి ఆచూకీ కోసం అటవీ, పోలీసు శాఖ అధికారులు గాలిస్తున్నారు. మంగళవారం రాత్రి గొల్లగూడెం, బంధపురం రోడ్డు అవంతి ఫ్యాక్టరీ సమీపంలోని పొగాకు తోటలో పెద్దపులి సంచరించగా కుక్కలు తిరిమినట్టు అలికిడి గమనించానని రైతు సుంకర గంగరాజు అటవీ, పోలీసు అధికారులకు సమాచారం అందజేశారు. పొలంలో పులి గాడ్రింపులు విన్న పొగాకు పంట కూలీలు భయభ్రాంతులకు గురిఅయ్యారు. పొగాకు తోటల్లో పెద్దపులి పాదముద్రలను దేవరపల్లి సీఐ కె.రామకృష్ణ, ఎస్సై కె.శ్రీహరిరావు, ఫారెస్ట్ అధికారులు బుధవారం ఉదయం పరిశీలించారు. గొల్లగూడెం బంధపురం పొలాల నుంచి గోపాలపురం మండలంలోని వేళ్లచింతల గూడెం ప్రాంతానికి వెళ్లినట్లు పాదముద్రలు ఉన్నాయని అధికారులు చెప్పారు. పొగాకు క్యూరింగ్ నిలిపివేయాలని రైతులు, కూలీలకు సూచించారు. అధికారుల ఆదేశాల మేరకు పొగాకు పనులు నిలుపుదల చేసినట్లు రైతులు చెప్పారు. అయితే సకాలంలో పొగాకు రెలిచి క్యూరింగ్ చేయకపోతే తోటలు దెబ్బతింటాయని దీనివల్ల తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాలలో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారలు నిర్ధారణ చేశారు. అయితే మంగళవారం రాత్రి పులి అవంతి ఫ్యాక్టరీ వద్ద ఉన్న సీసీ కెమెరాలకు చిక్కినట్లు షోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిని అధికారులు నిర్ధారించాల్సి ఉంది.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



బల్లిపాడు పాఠశాలలో మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తాళ్లపూడి: బల్లిపాడు మండల పరిషత్ జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవికే రాజు, ఉపాధ్యాయులు కనక దుర్గ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవం నిర్వహించారు. మాతృబాషకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.-న్నారు. డైట్ కళాశాలలో కూడ మాతృభాష దినోత్సవం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న అరుణకుమారి

కొవ్వూరు: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని పట్టణంలో బసివిరెడ్డిపేటలో బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడిగా గంధం బాజ్జీ, చాగల్లు మండల అధ్యక్షుడిగా బోనిగే రాంబాబు, తాళ్లపూడి మండల అధ్యక్షుడిగా సాయన సుబ్బారావు, కొవ్వూరు మండల అధ్యక్షుడిగా జొన్నకూటి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడిగా కొణిదెల శ్రీనివాసరావులను నియమిస్తూ నియమాక పత్రాలను అందజేశారు. పీసీసీ కార్యవర్గ సభ్యులు గెడ్డం సాయిబాబా, కొయ్య వెంకట్రావు, అందె వెంకట నాగభూషణం, మీసాల సత్యనారా యణ, గుమ్మాపు జాన్, బచ్చు బుజ్జిబాబు, పాలకుర్తి ప్రభాకర చౌదరి,మట్టా రవి కుమార్,బండి విజయ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

చాగల్లు: రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. మార్కొండపాడు పీహెచ్‌సీలో బుధవారం నూతనంగా సీఆర్‌పీ టెస్ట్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు రక్త పరీక్షలు సులభంగా ఈ మిషన్ ద్వారా నిర్వహించి, వెంటనే రిపోర్టు వివరాలు తెలియజేయవచ్చన్నారు. తద్వారా వైద్యసేవలు మరింత వేగంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందన్నారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నరసన్న సేవలో మంత్రి వనిత



మంత్రి వనితకు స్వామివారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈవో లక్ష్మణస్వామి

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారిని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వాటిని పురస్కరించుకుని స్వామివారి దర్శనార్థం ఆలయానికి విచ్చేసిన ఆమెకు దేవస్థానం అధికారులు, అర్చకులు, పండితులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అర్చకులు, పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని పలికి, పట్టు వస్త్రాన్ని అందజేశారు.

ఆ తర్వాత ఆలయ ఏఈవో ఆర్.లక్ష్మణస్వామి స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, గ్రామ సర్పంచ్ పసుపులేటి ఏసుబాబు, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పెద్దిరెడ్డి పద్మ జ్యోతి శ్రీనివాస్, తెమ్మంద్రు రమేష్, ఐఎస్ రాఘవాపురం సర్పంచ్ దాకారపు బంగారమ్మ, బండారు ధనలక్ష్మీ, పెద్దిన దిలీప్ తదితరులున్నారు.